

# శవం గాలి పీల్చదు!



సి.వి. నానారావు

GOVERNMENT COLLEGE
LIBRARY
SRIKAKULAM

అర్ధరాత్రి 12 గంటలు—అల్సేషియన్ కుక్క టైగర్ ఆ మూడంతస్తుల భవనంచుట్టూ నిశ్శబ్దంగా తిరుగుతూ ప్రహరీలోపల కాపలా కాస్తున్నది. కాంపౌండ్‌వాల్ కున్న ఇనుపచువ్వల గేటుకు తాళంవేసి వుంది. గేటు బయట రోడ్డుమీద వున్న మునిసిపాలిటీవారి మెర్క్యూరీలైటు వెలుగు గేటును వెలుగులో ముంచుతూ, గేటులోనుండి లోపలికి కాంపౌండ్‌లో కొంతదూరం వరకు పడుతోంది. మిగతా కాంపౌండ్ అంతా చీకటిగా వుంది.

భవనంచుట్టూ తిరుగుతున్న టైగర్ గేటుమీద గోళ్ళతో గీసిన చప్పుడు వినిపించి గేటువైపు తల తిప్పింది. ఒక తెల్ల ఆడకుక్క గేటుమీద ముందు కాళ్ళు వేసి నిలబడివుంది. టైగర్ ఆడ వాసన పసికట్టింది. కాని, కాపలాడ్యూటీ మానేయటమెలా! అని ఒక్కక్షణం విలబడింది. ఆఖరికి కుక్కబుద్ధే గెలిచింది. గేటువైపు అడుగేసింది. టైగర్ రావటాన్ని గమనించి తెల్ల ఆడకుక్క గోళ్ళతో గీరటం ఎక్కువచేసి, ఆహ్వానించినట్లుగా చిన్నగా 'కుయ్! కుయ్!' మని అరుస్తూ తోక వూపుతూ ఎగరసాగింది. టైగర్ పరుగెత్తి గేటును సమీపించి, ముందుకాళ్ళెత్తి తెల్లకుక్క ముందుకాళ్ళపైన పెట్టి 'కుయ్! కుయ్!' మంటూ తల గేటు చువ్వలలోనుండి బయటపెట్టి తెల్లకుక్క మూతిదగ్గర మూతి ఉంచింది.

నల్లముసుగు ఆపాదమస్తకం కప్పుకునివున్న మనిషి గోడ చాటునుండి నిశ్శబ్దంగా ముందుకు కదిలాడు. అతని కుడిచెయ్యి మెరుపులాగా కదిలి ఒక నల్ల సిల్కు ముసుగును గేటు బయటకు పెట్టిన టైగర్ మూతిమీదుగా ముఖానికి బిగించింది. అంతా రెండు సెకన్లలో జరిగిపోయింది.

నోరు తెరవటానికి వీలులేక టైగర్ నోటిలోనుండి 'కుయ్ కుయ్!' శబ్దాలు ఆగిపోయాయి. ఐనా, టైగర్ బెదరకుండా వెనుకకు గెంతి బలంగా ఆ ముసుగుతాటిని లాగసాగింది. ఐతే ఆ

ముసుగుమనిషి తాటిని ఒకచేత్తో బలంగా పట్టి ఉంచుతూ, రెండోచేత్తో తాడును గేటుపైన గట్టిగా ముడివేశాడు. తాడు పొట్టికావటంవల్ల టైగర్ ఐదారు అంగుళాలు నేలమీదినుండి పైకి లేపబడి గేటునుండి వ్రేలాడసాగింది. రెండునిముషాలు కాళ్ళు తన్నుకుని ఎగిరి తల వ్రేళ్ళాడేసింది.

ముసుగు మనిషి తృప్తిగా తల పంకించి, తెల్లకుక్కను ఉద్దేశించి, "జిమ్మీ! గో." అన్నాడు! వెంటనే అది వెనక్కి తిరిగి రోడ్డుప్రక్క చెట్లనీడల్లో పరుగెత్తుతూ టౌన్లోకి వెళ్ళింది.

ముసుగు మనిషి భవనాన్ని పరిశీలనగా చూశాడు; తాను గేటుదగ్గర కాపలా కుక్కను కట్టివేయటాన్ని భవనంలోని వారు గమనించిన సూచన ఏమాత్రం కనబడలేదు. అసలు భవనంలో మనుషులున్న అలికిడే లేదు.

ముసుగుమనిషి గేటు ఎక్కి లోపలికి పిల్లిలాగా దూకాడు. మెల్లగా అడుగులో అడుగు వేసుకుంటూ వెళ్ళి భవనంచుట్టూ పరచుకునివున్న చీకట్లో ఒక చిక్కటి నీడగా ఇమిడిపోయాడు. నీడలాగా కదులుతూ భవనం వెనుక వైపుకు వెళ్లాడు. భవనం వెనుకవైపున నేలమీద నుండి మూడవ అంతస్తు టెర్రెసుమీది నీళ్ళ ట్యాంకు వరకూ ఒక వాటర్ పైపు వుంది. ఆ పైపును పట్టుకుని జాగ్రత్తగా ఒక్కొక్క అడుగే పైకి ఎగబ్రాక సాగాడు. ఐదు నిమిషాల్లో మూడవ అంతస్తు టెర్రెసు మీద అడుగుపెట్టి, ముందుకు కదిలాడు.

రెండు నిమిషాల తర్వాత "అమ్మో! రక్షించండి! రక్షి..."అని ఒక స్త్రీ ఆర్తనాదం ఆ భవనమంతా ప్రతిధ్వనించింది: అ కేక మధ్యలోనే గొంతులోది గొంతులోనే ఆగిపోయింది. తర్వాత నిశ్శబ్దం! మరునిమిషం 'ఢాం' అన్న శబ్దంతో ఆ భవనంలో ఎక్కడో రివాల్వర్ పేలింది! మరు అరనిముషంలో ముసుగు మనిషి వాటర్ పైపు పట్టుకుని సర్రున నేలకు జారాడు. గేటుదగ్గరకు పరుగెత్తి గేటెక్కి బయటకు దూకి, రోడ్డు ప్రక్కనున్న చెట్ల నీడల్లోకి పరుగెత్తాడు. అప్పుడు మూడవ అంతస్తులోని లైట్లు ఒక్కటొక్కటే వెలగసాగాయి.

* * *

అదే రాత్రి ఒంటిగంట.

ముందుగా పోలీసుజీపు, దాని వెనుకే ఒక వ్యానూ వచ్చి ఆ భవనం గేటు ముందు ఆగాయి.

భవంతిచుట్టూ నాలుగు వైపులా అమర్చివున్న లైట్లు వేయటం వల్ల కాంపౌండ్ అంతా మెర్క్యూరీలైట్లు వెలుగుపరచుకుని వుంది. గేటుకు రెండు వైపులా అమర్చివున్న భూగోళం బల్బులు కూడా వెలుగుతుండటంతో గేటుదగ్గరనుండీ భవనం గుమ్మంవరకు దేదీప్యమానంగా వుంది.

గేటుదగ్గర ఒక నలభై సంవత్సరాల వయసున్న వ్యక్తి నిలబడి వున్నాడు. అతను నల్లగా, సన్నగా పొట్టిగా వున్నాడు. అతని కళ్ళు నీళ్ళతో నిండి వున్నాయి. అతడు భయంతో కొద్దిగా వణుకుతున్నాడు.

జీపులోనుండి దిగుతున్న ఇనస్పెక్టర్ ఇంద్రకుమార్‌ను చూస్తూనే, ఆ సన్నటి వ్యక్తి చేతులు జోడించి, "నమస్తే సార్" అన్నాడు గద్గద కంఠంతో. ఇనస్పెక్టర్ తన వెనుకే జీపులోనుండి దిగుతున్న ఆజానుబాహుణ్ణి ఉద్దేశించి "అనుపమ్! ఆయనే శాంతారాం, ఈ ఊళ్లో పెద్ద కొటీశ్వరుడు. ఆయన భార్య హత్య చేయబడింది. ఆయనే మనకు ఫోన్ చేసింది" అని "మిస్టర్ శాంతారాం! మీట్ మై ఫ్రెండ్ అనుపమ్! డిటెక్టివ్ అనుపమ్! మీ ఫోన్ వచ్చినపుడు నా దగ్గరే వుంటే వెంటబెట్టుకుని వచ్చాను"అన్నాడు. "నమస్తే సార్!" అన్నాడు శాంతారాం.

గేటుకు వ్రేలాడుతున్న కుక్కవైపు నడిచాడు అనుపమ్.

"హంతకుడు కుక్కను చంపి లోపలికి ప్రవేశించినట్లున్నాడు" అని, "ఇదిగో విఘ్నం! ఆ కుక్కను డాక్టర్‌గారు పరీక్షించిన తర్వాత ఫొటోలు తీయండి! ఆ కుక్కకు బిగించిన ముసుగుమీద, గేటుమీద వ్రేలిముద్రలకోసం చూడండి" అని వ్యాన్‌లోనుండి దిగిన హెడ్‌కానిస్టేబుల్ విఘ్నానికి, పోలీసు బృందానికి పురమాయించాడు ఇనస్పెక్టర్.

"హత్య జరిగిన గదిని చూద్దాం పదండి!" అన్నాడు డిటెక్టివ్ అనుపమ్.

శాంతారాం వెనుక ఇనస్పెక్టర్ ఇంద్రకుమార్, డిటెక్టివ్ అనుపమ్ భవనం లోపలికి వెళ్ళారు.

* * *

బెడ్‌రూం మధ్యవున్న కింగ్‌సైజ్ డబుల్ బెడ్‌మీద ఒక స్త్రీ ఆకారం పడివుంది. ఆ హత్యగావింపబడిన స్త్రీ కాలిగోళ్ళకు ఎర్ర రంగు నెయిల్‌పాలిష్ వేసివుంది. కాలికి గజ్జెల పట్టాలు వున్నాయి. నల్లపూల తెల్లచీర ధరించివుంది. ఎర్ర సిల్కు జాకెట్ పైట చాటునుండి కొద్దిగా కనబడుతున్నది. లావుగా, తెల్లగావున్న చేతులకు మట్టిగాజులు వున్నాయి. చేతిగోళ్ళకు కూడా ఎర్రరంగు నెయిల్ పాలిష్ వేసివుంది. ముఖంమాత్రం ఒక నల్లని సిల్కుముసుగుతో కట్టబడి వుంది!

అనుపమ్ శవం ముఖానికున్న ముసుగును పరిశీలనగా చూసి, "కుక్కను చంపిన విధంగానే ఆమెను కూడా మెడచుట్టూ ముసుగుకున్న త్రాడు బిగించి చంపినట్లు కనబడుతోంది" అన్నాడు.

"ఒక్కరోజే నాకు జీవితంలో ప్రియమైన రెండింటినీ పోగొట్టుకున్నాను సార్. అది ఒకటి నా భార్య! రెండవది నా కుక్క టైగర్! వీళ్ళిద్దరినీ చంపిన హంతకుడు ఉరికంబమెక్కందే నాకు

నిద్రపట్టదు! నా కోట్లకొద్ది ఆస్తంతా మీ పరం చేస్తాను. ఆ హంతకుణ్ణి నాకు అప్పగించండి. ముక్కలు ముక్కలుగా చీల్చేస్తాను!" అంటూ ఆవేశంతో అరిచాడు శాంతారాం.


అప్పుడు అనుపమ్ "డోన్ట్ గెట్ ఎక్సైటెడ్! ఆవేశపడకండి. మిస్టర్ శాంతారాం! అసలు ఏమి జరిగిందో వివరంగా చెప్పండి" అన్నాడు.

అప్పుడు శాంతారాం "ఈ బెడ్ రూం నా భార్యది, దీనికి ఆనుకుని ఆ మధ్య డోర్ లోనుంచి కనబడుతున్న అవతల బెడ్ రూం నాది. పనిమనిషి వంటచేసి రాత్రి ఎనిమిది గంటలకు వెళ్ళిపోయింది. ఆరోజుకూడా ఎప్పటిలా 10గంటలకు భోంచేసి పడుకున్నాను. అర్ధరాత్రి నా భార్య తన బెడ్ రూంలో నుండి 'అమ్మో! రక్షించండి! రక్షిం...' అని భయంగా కేకపెట్టటంతో నాకు మెలకువ వచ్చింది: ఆ కేక మధ్యలోనే ఆగిపోయింది. వెంటనే లేచి బీరువాలో నుండి రివాల్వర్ తీసుకుని మా ఇద్దరి బెడ్ రూంలకు మధ్యనున్న ఆ డోర్ లో నుండి ఈ బెడ్ రూంలోకి ఒచ్చేసరికి నా భార్య ముఖానికి ముసుగువేసి వుంది. ఒక ముసుగుమనిషి నా భార్య మెడలోని 5 లక్షల ఖరీదుచేసే వజ్రాలహారాన్ని తెంపుతూన్నాడు. నన్నుచూసి హారం చేత్తోపట్టుకుని కిటికీవైపు దూకాడు: నేను వెంటనే రివాల్వర్ పేల్చాను. అతను ఎగిరి కిటికీలోనుండి టెర్రెస్ మీదకు వెళ్ళాడు. రివాల్వర్ బులెట్ కిటికీ అద్దానికి తగిలి అద్దం పగిలింది. నేనుకూడా కిటికీలోనుండి టెర్రెస్ మీదికి దూకాను. కాని, అప్పటికే అతను వాటర్ పైపు మీదుగా జర్రున క్రిందకు జారి గేటు దూకి పారిపోయాడు. పైగర్ ఏమైందోనని అప్పుడు నాకు అనుమానం కలిగింది. మీకు ఫోన్ చేసి భవనం చుట్టూవున్న లైట్లన్నీ వేసి, మీకోసం గేటు దగ్గర వెయిట్ చేస్తున్నాను" అన్నాడు శాంతారామ్.

అనుపమ్, ఇనస్పెక్టర్ శాంతారాం బెడ్ రూంలోకి నడిచారు. అది అచ్చం శవంవున్న బెడ్ రూంలాగే వుంది.

"బెడ్ కు ప్రక్కనున్న ఆ గాడ్రేజ్ బీరువాలోనే నా రివాల్వర్ వుంది" అంటూ శాంతారాం చొక్కాజేబులోనుండి తాళంతీసి, బీరువా తెరచి, ఒక అరలో బట్టల దొంతిమీద పెట్టివున్న నల్లగా నిగనిగలాడుతున్న రివాల్వర్ ను తీసి, "ఇదే సార్ నా రివాల్వర్! మొత్తం ఆరు బుల్లెట్స్ లో ఒక బుల్లెట్ కాల్చాను ఇంకా ఐదే ఉంటాయి." అని తెరిచి చూపించటానికి మీట నొక్కబోయేంతలో...

"దట్సాల్ రైట్! అదంతా మా బెలాస్టిక్ ఎక్స్పర్ట్ చూసుకుంటాడు." అంటూ తన చేతికి కర్చీఫ్ చుట్టుకొని ఆ రివాల్వర్ ను అందుకొని జేబులో వేసుకున్నాడు ఇనస్పెక్టర్.




అనుపమ్, ఇనస్పెక్టర్ శాంతారాం బెడ్ రూంలో నుండి శవంవున్న బెడ్ రూంలోకి వచ్చి బెడ్ దగ్గరగా వున్న కిటికీవద్దకు వెళ్లారు. కిటికీ పగిలిన ముక్కలు చిన్నవీ, పెద్దవీ టెర్రెసుమీద దూరదూరంగా పడివున్నాయి: ఇద్దరూ కిటికీలోనుండి టెర్రెసు మీదకు వెళ్ళారు. టెర్రెసు చివరివరకూ వెళ్ళి అక్కడ వున్న వాటర్ ట్యాంకుకు అమర్చివున్న వాటర్ పైపును, ఆ పైపు భవనం వెనుక ప్రక్క నేలవరకూ ఉండటాన్ని గమనించారు.

ఇనస్పెక్టర్, అనుపమ్ తిరిగి బెడ్ రూం కిటికీ దగ్గరకు వచ్చేసరికి ఒక నడివయసు వ్యక్తి బెడ్ రూంలోనుంచి వస్తూ,

"గుడ్ న్యూస్ ఇనస్పెక్టర్! కుక్క మొఖానికున్న ముసుగుమీద, గేటుమీద స్పష్టమైన వేలిముద్రలున్నాయి" అంటూ శవం ముఖంమీద ముసుగును చూస్తూనే "మళ్ళీ ఇకక్కడొక ముసుగా?" అంటూ దగ్గరకు వెళ్ళాడు తన సరంజామాతో.

అతని వెనుకే లోపలికి వచ్చిన పోలీసు డాక్టరు, "ఇనస్పెక్టర్! కుక్క మెడకు తాడు బిగించటంవల్ల చనిపోయినట్లు తెలుస్తోంది!" అని, శవం ముఖానికున్న ముసుగును చూసి, "ఇక్కడా అంతేలాగుంది" అంటూ తనూ శవం దగ్గరకు వెళ్ళాడు.

ఇనస్పెక్టరు, "ఆ ముసుగుమీదకూడ మీకు వేలిముద్రలు దొరుకుతాయనుకుంటాను, రామారావుగారూ" అని, "ఇదిగో దాసూ! కుక్కను, ముసుగునూ ఏం చేశారు" అన్నాడు నల్లగా ఎత్తుగా వున్న కానిస్టేబుల్ని ఉద్దేశించి.

"రెండింటినీ వ్యానులో చేర్చాం సార్" అన్నాడు ఆ కానిస్టేబులు బెడ్ రూం గుమ్మం బయట హాలులో నుంచుని.

"ఆల్ రైట్" అని ఇనస్పెక్టరు కిటికీలోనుండి రూంలోకి దిగి శవం దగ్గరకు వెళ్ళాడు!

"ఇన్స్పెక్టర్! ఇక్కడా గుడ్ న్యూసే! కుక్క ముసుగుమీదవున్న వేలిముద్రలే

ఆ ముసుగుమీదకూడా కొట్టొచ్చిచ్చినట్టు కనబడుతున్నాయి." అన్నాడు గర్వంగా రామారావు.

"నేను చెప్పలేదా సార్! ఇంక మీరు ఆలస్యం చెయ్యకండి సార్? నా రేఖను చంపిన హంతకుణ్ణి తక్షణం ఉరికంబ మెక్కించండి" అన్నాడు శాంతారాం, ఇనస్పెక్టర్ చేతులు పట్టుకుని పిచ్చి చూపులు చూస్తూ.

అప్పుడు అనుపమ్ "మిస్టర్ శాంతారాం! మీరు దయచేసి హాలులో కూర్చోండి! ఈ ఇన్వెస్టిగేషన్ అయిన తర్వాత మీతో మాట్లాడుతాం!"అన్నాడు ఇనస్పెక్టర్ కేసి అర్థవంతంగా చూస్తూ.

ఇనస్పెక్టర్ "విఘ్నం! శాంతారాం గారిని హాలులో కూర్చోబెట్టు"అన్నాడు, బయట హాల్లో పచారుచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ నుద్దేశించి.

మరుక్షణం పొట్టిగా, లావుగా ఎర్రగా పీపాలా వున్న విఘ్నం మెరుపులాగా గదిలోకి దూకి, శాంతారాం చెయ్యిపట్టుకుని అతనేదో చెప్పటానికి నోరుతెరిచేలోగా బెడ్ రూం వెలుపలి హాల్లోకి లాక్కుపోయాడు.

అప్పుడు ఇనస్పెక్టర్, "పాపం! భార్య అకస్మాత్తుగా పోయేసరికి మతి చలించినట్లుంది"అన్నాడు.

అప్పుడే వ్రేలిముద్రల రామారావు శవం ముఖానికున్న ముసుగు తొలగించాడు. అందరూ అటు తిరిగారు.

కాళ్ళూ, నాలుకా బయటికి వెళ్ళుకొచ్చి ముఖం చూడటానికి చాల భయంకరంగా వుంది.

పోలీసు డాక్టరు ముందుకువెళ్ళి పరీక్షించి "మనం ఊహిస్తున్నట్లే చంపి గొంతునులిమి చంపబడింది,ఇనస్పెక్టర్, అందులో సందేహం ఏమాత్రం లేదు. చనిపోయి ఒక గంట అయ్యుండొచ్చు. అంటే అర్ధరాత్రి ఒంటిగంట ప్రాంతాన ఈ హత్య జరిగింది. ఇంకా వివరాలు పోస్టుమార్టమ్‌లో తేలతాయి" అన్నాడు.

ఫోటోగ్రాఫరు కెమెరాను శవం ముఖంమీద ఫోకస్ చేశాడు.

"రామారావుగారూ! ఆ కిటికీ గ్రిల్ మీద టెర్రెస్ చివరవున్న వాటర్ ట్యాంకునుండి క్రింద నేలవరకూ వున్న వాటర్ పైపునూ హంతకుని వేలిముద్రల కోసం పరీక్షించండి?" అన్నాడు ఇనస్పెక్టర్.

ఉదయం 7 గంటలకు పోలీసు కుక్కను శవం ఉన్న బెడ్ రూంలోకి తెచ్చారు. కుక్కను మంచం చుట్టూ తిప్పి వ్రేలిముద్రల రామారావు శవం ముఖం మీద నుండి తీసి మంచంమీదనే పెట్టిన ముసుగును వాసన చూపించాడు కానిస్టేబిల్ దాసు.

కుక్క అటూ ఇటూ తల త్రిప్పి గాలిలో వాసన చూసి నేరుగా కిటికీ వద్దకు వెళ్ళింది. మళ్ళీ వాసన చూసి ఎగిరి టెర్రెస్‌మీదికి దూకి తల వంచి వాసన చూస్తూ, వాటర్ ట్యాంకు వరకూ పరుగెత్తింది. టెర్రెస్ చివరకు వెళ్ళి

మెడ వంచి భవనం వెనుక నేలమీది వరకూ ఉన్న వాటర్ పైపును చూస్తూ మొరగసాగింది.

"దాసూ! క్రిందకు ఆ వాటర్ పైపు దగ్గరకు కుక్కను తీసుకుపద!" అన్నాడు ఇనస్పెక్టర్.

అందరూ క్రింద భవనం వెనుక నున్న వాటర్‌పైపు దగ్గరకు చేరారు.

కుక్క వాటర్ పైపును వాసన చూసి, నేల వాసన చూస్తూ గేటువైపు పరుగెత్తింది. కుక్క గేటు దగ్గరకు వెళ్ళగానే, దాసు జేబులో నుండి హంతకుడు కుక్క టైగర్‌కు బిగించి ప్రాణం తీసిన ముసుగును తీసి వాసన చూపాడు. ఆ ముసుగు వాసన చూస్తూనే దానికి అంటి వున్న కుక్క (టైగర్) వాసన వల్ల ఒక్క క్షణం పోలీసు కుక్క తటపటాయించింది. మరుక్షణం వేగంగా గేటు బయటికి చూసింది. రోడ్డుమీద రెండు ఫర్లాంగులు పరుగెత్తి అక్కడ ఉన్న ఆటోస్టాండు దగ్గర అటూ ఇటూ వాసన చూస్తూ తిరిగింది. రెండు నిమిషాల తర్వాత స్టాండులో పార్కుచేసి వున్న అరడజను ఆటోలలో ఒక ఆటో దగ్గరకు దారితీసి ఎగిరి లోపలకు ఎక్కి వెనుక సీటు వాసన చూడసాగింది.

ఆటోడ్రైవర్లందరూ తమ తమ ఆటోలను వదలి భయం భయంగా పోలీసుపార్టీ దగ్గరకు వచ్చారు.

"ఈ ఆటో ఎవరదిరా?" అని గర్జించాడు హెడ్‌కానిస్టేబిల్ విఘ్నం.

"నా...నాది... నా...ది సార్!" అని గజగజ వణుకుతూ ఒక ఎర్రటి, బక్కపల్చటి కుర్రాడు ఆటోడ్రైవర్ల గుంపులో నుండి ముందుకు వచ్చాడు.

"మీ రందరూ ఎల్లండ్రా. ఈడితో మాట్లాడాలి!" అంటూ విఘ్నం లాఠీ పట్టుకుని మిగిలిన ఆటోడ్రైవర్లందరినీ దూరంగా తరుముకెళ్ళాడు.

అనుపమ్, "నీ పేరేమిటోయ్?" అన్నాడు ఆటోడ్రైవరుతో.

"రంగయ్య సార్! నేనేం నేరం చెయ్యలేదు సార్! నన్ను కాపాడండి సార్!" అంటూ ఆటోడ్రైవరు రంగయ్య యూనిఫారంలో వున్న ఇనస్పెక్టర్ ఇంద్రకుమార్ కాళ్ళమీద పడి బావురుమన్నాడు.

"నీకేం భయంలేదు! మే మడిగిన ప్రశ్నలకు నిజమైన జవాబు చెప్పు!" అన్నాడు అనుపమ్.

"అట్టాగే నిజం చెప్తా సార్!" అన్నాడు రంగయ్య గజగజలాడుతూ:

"నిన్నరాత్రి షుమారు 12 గంటలప్పుడు ఇక్కడ నీ ఆటోలో ఎవర్ని ఎక్కించుకున్నావురా?" అన్నాడు ఇనస్పెక్టర్ ఇంద్రకుమార్.

రంగయ్య రెండు క్షణాలు ఆలోచించి,

"నిన్న రాత్రి 12 గంటలప్పుడు అన్ని ఆటోలూ ఊళ్ళోకెళ్ళాయి సార్!

నా ఆటో ఒక్కటే స్టాండులో ఉంది సార్! ఎవరో బాగా ఎత్తుగా, బలంగా తెల్లగా వున్న మనిషి సార్! తొందర్లో ఉన్నట్టున్నాడు సార్! చేతిలో చిన్న ఎర్రరంగు బ్రీఫ్‌కేస్‌తో పరుగెట్టినట్టుగా నడిచి వచ్చి, ఆటోలో ఎక్కి కూర్చుని, 'స్టేషన్‌కు పోనీయ్!' అన్నాడు సార్. అప్పుడు గోదావరి ఎక్స్‌ప్రెస్సు స్టేషనుకు వచ్చే టైమయ్యింది సార్! పాపం తొందరగా ఆ బండిలో వెళ్ళాల్సి వుంది కాబోలు అనుకున్నాను సార్!"

"రంగయ్యా! అతడు ఎలాంటి డ్రస్ వేసుకున్నాడో చెప్పగలవా!" అన్నాడు అనుపమ్

"తెల్ల ఫాంటులో తెల్ల బుష్‌షర్టు టక్ చేశాడు సార్!" కాళ్ళకు నల్ల ఆకు చెప్పులు వేసుకున్నాడు సార్!" అన్నాడు రంగయ్య.

"సరే! ఆటో ఎక్కు! స్టేషనుకు పోనీయ్!" అన్నాడు అనుపమ్.

ఇనస్పెక్టర్ ఇంద్రకుమార్ అప్పుడే ఆటోడ్రైవర్లను దూరంగా పోగేసి పరుగులాంటి నడకతో వస్తున్న హెడ్ కానిస్టేబిల్ విఘ్నంతో, "విఘ్నం! మేము ఆటోలో రైల్వేస్టేషన్‌కు వెళ్తున్నాం! నువ్వు, మిగిలిన మన పార్టీ జీపులో ఫాలో కండి." అన్నాడు.

అనుపమ్, కుక్కను పట్టుకుని కానిస్టేబుల్ దాసూ ఆటోలో కూర్చున్నారు. ఇనస్పెక్టర్ ఇంద్రకుమార్ కూడా ఆటో ఎక్కగానే రంగయ్య ఆటో ముందుకి దూకించాడు. ఆటో వెళ్ళి రైల్వేస్టేషను లోని ఆటోస్టాండు దగ్గర ఆగింది.

"ఇక్కడే ఆపాను సార్! అతను డబ్బులిచ్చి అప్పుడే వచ్చిన గోదావరి ఎక్స్‌ప్రెస్సులో నుండి దిగిన జనంలోకి జొరబడ్డాడు సార్! రైలెక్కి వెళ్ళి పోయుంటాడు సార్!" అన్నాడు రంగయ్య

కుక్కను పట్టుకుని దాసూ, ఇనస్పెక్టర్. అనుపమ్ ఆటో దిగారు.

అనుపమ్, "దాసూ. ఒకసారి ముసుగు వాసన చూపించి కుక్కను వదులు!" అన్నాడు.

దాసు ముసుగు వాసన చూపించాడు.

కుక్క తల క్రిందకు వంచి అటూ ఇటూ ఆటోస్టాండులో తిరిగి వాసన చూసి, మెల్లగా ఆటోస్టాండును వదలి, నేలను వాసన చూస్తూ నేరుగా ఆ ప్రక్కనే వున్న రిక్షాస్టాండుకు దారి తీసింది.

ఇనస్పెక్టరూ, అనుపమ్, కుక్కను పట్టుకున్న దాసు వెనువెంటే అక్కడికి వెళ్ళారు.

కుక్క రిక్షాస్టాండులో అటూ ఇటూ తిరిగి, ఒక ఎరుపురంగు పెయింట్ వేసి వున్న రిక్షా దగ్గర ఆగి, ఎగిరి పైకి ఎక్కి సీటు వాసన చూసి రిక్షాలో కూర్చుంది.



ప్రక్కనే ఉన్న కిళ్ళీబంకు దగ్గర బీడీ త్రాగుతున్న ఆ రిక్షా డ్రైవరు బీడీ పారేసి గజగజ వణుకుతూ వచ్చి, చేతులు జోడించి నిలుచున్నాడు.

అప్పటికే, వెనుక ఫాలో అవుతున్న జీపులో నుండి దిగిన హెడ్ కానిస్టేబిల్ విఘ్నం లాటీ తిప్పుతూ అక్కడ గుమి కూడటానికి తయారవుతున్న రిక్షా డ్రైవర్లందర్నీ దూరంగా తరిమాడు.

ఇనస్పెక్టరు యూనిఫారం చూసి రిక్షా డ్రైవరు చలిజ్వరం వచ్చినవాడిలా గజగజ వణకటం గమనించి, అనుపమ్ "నీకేం భయం లేదు! నీ పేరేంటి?" అన్నాడు.

"శీతయ్య బాబయ్యా!" అన్నాడు రిక్షా డ్రైవరు.

"అయ్యగారు అడిగిందానికి నిజం సెప్తే నీకే పెమాదంలేదు. లేదా!" అని కళ్ళెర్రజేశాడు కానిస్టేబిలు దాసు.

"దాసూ! నువ్వు కుక్కను తీసుకుని పక్కకు వెళ్ళవోయ్! సీతయ్యా! అనవసరంగా భయపడకు! నిన్న అర్ధరాత్రి గోదావరి ఎక్స్‌ప్రెస్ వచ్చినప్పుడు, తెల్లపాంటులో తెల్ల బుష్షర్టు టక్ చేసి, కాళ్ళకు నల్ల అకు చెప్పులు వేసుకుని, చేతిలో చిన్న ఎర్రరంగు బ్రీఫ్ కేస్ పట్టుకుని, ఎత్తుగా, బలంగా, తెల్లగా వున్న మనిషి నీ రిక్షా ఎక్కాడు కదూ!"

అన్నాడు అనుపమ్ నిదానంగా, లో గొంతుతో.

శీతయ్య అనుపమవంక మాంత్రికుణ్ణి చూసినట్లుగా, కళ్ళు పెద్దవిచేసి చూసి, "అవునండి బాబయ్యా! తమరు సెప్పే దంతా సత్తెపెమాణంగా నిజమే! బాబయ్యా" అన్నాడు.

అతన్ని ఎక్కడ దింపావ్?అన్నాడు ఇనస్పెక్టర్.

"గాంధీనగర్ కాలనీ పైలాన్ దగ్గర అగిపోయాడు బాబయ్యా," అన్నాడు టక్కున శీతయ్య.

ఇనస్పెక్టర్, "దాసూ! కుక్కనుతీసు కుని నువ్వు ఇంకొక రిక్షాలో మా వెనక రా!" అని ఎగిరి రిక్షా ఎక్కి "గాంధీ నగర్ పోనీయ్!" అన్నాడు.

అనుపమ్ ఇనస్పెక్టరు ప్రక్కన కూర్చున్నాడు.

రిక్షా ముందుకు కదిలింది.

వాళ్ళ వెనుకనే దాసు కుక్కను ఇంకో రిక్షాలో ఎక్కించి ఫాలో అయ్యాడు.

అనుపమ్ ఇనస్పెక్టర్ ప్రక్కన కూర్చున్నాడు.

రిక్షా ముందుకు కదిలింది

వాళ్ళవెనుకనే దాసు కుక్కను ఇంకో రిక్షాలో ఎక్కించి ఫాలో అయ్యాడు.

విఘ్నంపార్టీ ఎక్కిన పోలీసుజీపు రిక్షాల వెనుక స్లోగా వెళ్ళసాగింది,

పదినిమిషాల్లో సీతయ్య గాంధీనగర్ పైలాన్‌దగ్గర రిక్షా అపి, "ఇక్కడే దింపాను బాబయ్యా! ఆయనిచ్చిన డబ్బులు తీసుకుని ఇక్కడే రిక్షాలో కాళ్ళు ముడుచుకుని ఒక కునుకు తీశా బాబయ్యా!" అన్నాడు.

వెనక రిక్షాలోనుండి దాసు క్రిందికి దిగాడు. ముసుగు వాసన చూపించి కుక్కను వదిలాడు.

కుక్క అటు ఇటు గాలిలో వాసన చూసి, తలవంచి రోడ్డు వాసన చూస్తూ ఒక ఇరుకు సందులోకి దారితీసింది.

కుక్క వెనుక దాసు, అనుపమ్, ఇనస్పెక్టర్ ఫాలో అయ్యారు.

కుక్క మెల్లగా వెళ్ళి ఒక పెంకు టింటి ముందు అగింది. ఆ ఇంటిచుట్టూ చిన్న పిట్టగోడ వుంది. గోడకు అమర్చి వున్న చిన్న పాత చెక్కగేటు విరిగి పడిపోయి వుంది. ఇంటిముందు ఖాళీ స్థలం, తర్వాత ఇల్లు, వెనక పెరడు వుంది. ఇంటి ఆవరణంతా పిచ్చి మొక్కలు పొదల్లా ఏపుగా పెరిగి వున్నాయి.

అనుపమ్ పెంకుటింటి తలుపు తట్ట డానికి వెళ్ళాడు.

అనుపమ్ తలుపు దగ్గరకు వెళ్తుండ గానే తలుపు మెల్లగా తెరుచుకుంది.

గుమ్మంలో తెల్లగా, ఎత్తుగా,బలంగా వున్న ముప్ఫైసంవత్సరాల యువకుడు తెల్లపాంటులో తెల్ల బుష్‌షర్టు టక్‌చేసి కాళ్ళకు నల్ల అకుచెప్పులతో, చేతిలో

చిన్న ఎర్ర బ్రీఫ్‌కేసుతో ప్రత్యక్ష మయ్యాడు. అతను ఎక్కడికో ప్రయాణమై వెళుతున్నాడు. అతన్ని చూస్తూనే అనుపమ్ నవ్వుతూ,

"హల్లో మిస్టర్ లోకనాథం! ఉరఫ్ లోకనాథన్, ఉరఫ్ సుకుమారన్ ది గ్రేట్ బర్గలర్ గ్లాడ్ టు మీట్ యు! మద్రాసులో మాయమై ఈ ఊళ్లో ప్రత్యక్షమయ్యా వన్నమాట!" అంటూ గుమ్మంలోకి వెళ్ళాడు

ఆ యువకుడు ఒక్క క్షణం ఆశ్చర్య పోయి. మరుక్షణం తేరుకుని పాంటు జేబులోనుండి మెరుపు వేగంతో ఒక నల్ల సిల్కు ముసుగునుతీసి అనుపమ్ ముఖంమీద వేయబోయాడు. అనుపమ్ బూటుకాలితో అతనిచేతిమీద ఒక తన్ను తన్నాడు.అతని చేతిలోని ముసుగు ఎగిరి దూరంగా పడింది. అంతలో ఇనస్పెక్టరు ఇంద్రకుమార్ "హాండ్సప్!" అంటూ పిస్తోలు పట్టుకుని ఇంటిలోకి దూకాడు. ఆ యువకుడు చేతులు పైకెత్తాడు.

"మిస్టర్! కోటీశ్వరురాలు రేఖను హత్యచేసి వజ్రాలహారం దొంగిలించి నందుకు నిన్ను అరెస్టు చేస్తున్నాను" అని ముందుకుదూకి ఇనస్పెక్టర్ అతని చేతులకు బేడీలు వేశాడు.

అనుపమ్, అతని చేతిలోనుండి క్రింద పడిన చిన్న ఎర్రరంగు బ్రీఫ్‌కేసును అందుకుని తెరిచాడు.

"ఇనస్పెక్టర్ ఆ బ్రీఫ్‌కేసులో నేరస్తుడు గతరాత్రి ధరించిన ముసుగూ, దొంగిలించిన వజ్రాలహారము, మద్రాసుకు ఆ రోజుకు రిజర్వేషన్ టికెట్టు ఒకటీ వుంది." అంటూ అనుపమ్ బ్రీఫ్‌కేసులోనుండి వాటిని బయటకు తీశాడు.

"అవును సార్! నేను నేరస్తుణ్ణి! ఏం జరిగిందో అంతా చెప్తాను" అంటూ నేలమీద కూలబడ్డాడు. మిష్టర్ బర్గ్‌లర్ లోకనాధన్ ఏడుస్తూ.

ఆ ఇంట్లో ఒక మూల కుర్చీకి కట్టి వున్న తెల్ల ఆడకుక్క కూడా తన యజమాని ఏడుపులో శృతి కలిపింది. 'కుయ్ కుయ్' మంటూ.

* * *

"రండి, రండి! మిష్టర్ శాంతారాం మీ భార్యను హత్యచేసిన హంతకుడు దొరికాడు. మీరు చెప్పిన 6లక్షల విలువచేసే వజ్రాల హారంకూడా దొరికింది." అన్నాడు ఇనస్పెక్టర్ ఇంద్రకుమార్.

ఇంద్రకుమార్ పోలీస్ స్టేషన్లో టేబిల్ దగ్గర తన అఫీషియల్ సీట్లో కూర్చుని వున్నాడు. టేబిల్ మీద వజ్రాల హారం వుంది. టేబిల్‌కు ఒక ప్రక్కనున్న కుర్చీలో అనుపమ్ కూర్చొని వున్నాడు. ప్రక్కనే గోడకానించివున్న బెంచీమీద లోకనాధన్ కూర్చుని వున్నాడు. అతని దగ్గర హెడ్ కానిస్టేబుల్ విఘ్నం, కానిస్టేబుల్ దాసు లాఠీలు పట్టుకుని నిలబడి వున్నారు.

"థాంక్స్ సార్! ఒక్కరోజులో హంతకుణ్ణి పట్టుకున్నారు! ఆ వజ్రాల

హారం నాకిస్తే నేను వెళతాను! బిజినెస్ తొందరలో ఉన్నాను!" అన్నాడు శాంతారాం.

"మిస్టర్ శాంతారాం? బిజినెస్ తొందరలో ఉన్నావా? లేక ఊరు వదిలి ఉడాయించే తొందరలో ఉన్నావా?" అన్నాడు అనుపమ్ నవ్వుతూ.

"ఏమిటి ఇనస్పెక్టర్. మీ స్నేహితుడు పెద్ద డిటెక్టివ్ అని చెప్పారు! మీ పోలీసు కుక్కే నయం! నేరుగా హంతకుడి ఇంటికి దారి తీసింది. ఈ డిటెక్టివ్‌గారికి ఆపాటి తెలివి కూడా ఉన్నట్లులేదు!" అని ఈసడింపుగా అంటూ శాంతారాం వంగి ఇనస్పెక్టర్ ముందున్న వజ్రాల హారాన్ని అందుకోబోయాడు.


అంతే! అతని రెండు చేతులకూ మెరుపు వేగంతో బేడీలు వేశాడు ఇనస్పెక్టర్! "నీ భార్య రేఖను హత్య చేసినందుకు నిన్ను అరెస్టు చేస్తున్నాను మిస్టర్ శాంతారాం!" అన్నాడు.

"ఏదో మాయచేసి, భయపెట్టి, నా వజ్రాల హారం కాజేయాలనుకుంటున్నారేమో జాగ్రత్త! నేను కోటీశ్వరుణ్ణన్న మాట మరువకండి! మీరు వెంటనే క్షమాపణ కోరుకుంటే క్షమిస్తా! లేదా ఇనస్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌కు రిపోర్టుచేసి నీ ఉద్యోగం పీకించేస్తా ఇనస్పెక్టర్!" అన్నాడు శాంతారాం తన చేతికున్న బేడీలను 'ఫట్'మని టేబిలు మీద కోపంగా కొట్టి.

"పీణ్ణి సెల్‌లోకి తోసి ఎముకలు ఇరగ్గొట్టమంటారా సార్!" అంటూ రౌద్రంగా ముందుకు వచ్చాడు విఘ్నం.

"ముందు నిన్ను నోరు ముయ్యమంటాను!" అన్నాడు ఇనస్పెక్టర్ కోపంగా.

అప్పుడు అనుపమ్, "నీకు బెస్ట్ యాక్టర్ ప్రైజ్ ఇవ్వవచ్చు మిస్టర్ శాంతారాం! నువ్వు నీ దురలవాట్లతో ఆస్తంతా పాడుచేశావ్! ఆఖరికి ఇల్లు కూడా తనఖాలో వుంది. ఇక మిగిలింది, ఐదు లక్షల ఖరీదుచేసే వజ్రాల హారమొక్కటే! అది నీ భార్య ఎప్పుడూ మెడలో వేసుకుని నీకు అందకుండా జాగ్రత్తపడుతోంది! గత్యంతరం లేక నువ్వు తెగించావు. నువ్వు నీ భార్యను మెడకు తాడు బిగించి చంపి వజ్రాల హారం తీసుకుంటుండగా, పాపం లోకనాథన్ దొంగతనం కోసం ప్రెరెసుమీద వస్తూ కనబడ్డాడు. మొదట నీ భార్యను చంపి, వజ్రాలహారం తీసుకుని ఊరు విడిచి పారిపోదామనుకున్న నువ్వు అతన్ని చూస్తూనే క్షణంలో ప్లాను మార్చావు. దొంగను చంపి, నీ భార్యను హత్య చేస్తుండగా చంపినట్లు చెబితే ఎవరైనా నమ్ముతారు. హత్య విషయం సద్దుమణిగాక వజ్రాలహారం అమ్ముకుని జల్సాగా బ్రతకొచ్చు. ఇలా ఆలోచిస్తూ నీ బెడ్‌రూంలోకి పరుగెత్తి బీరువా




తెరిచి రివాల్వర్ తీసుకుని వెళ్ళావు, ఐతే అప్పటికే లోకనాథన్ శవాన్ని చూసి బెదిరి, లోపలవున్న వాళ్ళకు స్పృహ తప్పించటం కోసం అతను చేత్తో పట్టుకుని తెస్తున్న క్లోరోఫాం చల్లిన ముసుగును బెడ్‌రూం ఫ్లోర్‌మీద జారవదలి, నువ్వు తెంపి బెడ్‌మీదే వదిలిన వజ్రాలహారాన్ని అందుకుని కిటికీలోంచి దూకాడు. ఆ విధంగా పాపం నువ్వు ఒక్క క్షణం వెనుకయ్యావు. అయినా పట్టు వదలకుండా లోకనాథన్‌ను చంపటానికి రివాల్వర్ పేల్చావు. కాని, బుల్లెట్ గురితప్పి అతను తప్పించుకు పోగలిగాడు. అతను వదిలిన ముసుగు మీద నీ వ్రేలిముద్రలు పడకుండా జాగ్రత్తపడుతూ, నీ భార్య శవం ముఖానికి తగిలించి మాకు ఫోనుచేశావు! చచ్చిన కుక్క ముఖానికికూడా అటువంటి ముసుగే ఉండటంతో దాదాపు తప్పించుకోగలిగావు! కాని, నిన్ను హంతకునిగా పట్టి ఇచ్చిన సాక్ష్యం మాకు పోస్టుమార్టంలో దొరికింది. చచ్చిన కుక్క టైగర్ ఊపిరితిత్తుల్లో క్లోరోఫాం నిండివుంది. కాని, నీ భార్య ఊపిరితిత్తుల్లో క్లారోఫాం లేదు. శవం గాలిపీల్చదు! కనుక చనిపోయిన తర్వాతే నీ భార్యకు ముసుగు వేసినట్లు తెలిసింది. పాపం, నీకు లోకనాథంకు ముసుగులో క్లోరోఫాం చల్లినట్లు తెలియదు కదా! అది మామూలు ముసుగే అనుకుని పప్పులో కాలేశావ్, లోకనాథన్ తాను నిన్నటి అర్ధరాత్రి నీ ఇంట్లో చేసిందీ, చూసిందీ చెప్పటానికి ప్రభుత్వసాక్షిగా మారాడు. నీ ఆట కట్టు! మిష్టర్ శాంతారాం!" అన్నాడు అనుపమ్.

"అవునుసార్! నేను మహాపాపం చేశాను. అమాయకురాలైన నా భార్యను చేతులారా చంపేశాను. నేనే హంతకుణ్ణి" అంటూ శాంతారాం బేడీల చేతులతో ముఖం కప్పుకుని ఏడవసాగాడు!